



భవానీ ద్వీపంలో చురుగ్గా సాగుతున్న పనులు

కార్తీక ద్వీపం

కార్తీక మాసానికి వేదికయ్యేందుకు భవానీ ఐల్యాండ్ ముస్తాబు అవుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో అనేక ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేయడంతో ఆ ఐదేళ్లు సందర్శకులతో భవానీ ద్వీపం పోటెత్తింది. కానీ వైసీపీ ప్రభుత్వంలో మాత్రం మొదటి ఏడాది వరదలు, తర్వాత రెండేళ్లు కరోనాతో కార్తీక మాసంలో సందడి లేకుండా పోయింది. చివరి రెండేళ్లు అవకాశం చిక్కినా ఆ స్థాయిలో సందర్శకులు రాలేదు. ఒక్క కార్తీకమాసంలోనే ఏపీటీడీసీ అధికారులు భవానీ ద్వీపం ద్వారా రికార్డు స్థాయి ఆదాయాన్ని సాధించేవారు. సంస్థకు మంచి ఆదాయం తెచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని ద్వీపాన్ని సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

8లో

- పట్టుదలతో ముస్తాబు చేస్తున్న అధికారులు
- కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలు
- పాత్‌వేలు, లాన్లు ఇప్పటికే సిద్ధం
- నవంబరు 1 నాటికి అందుబాటులోకి..!

కోర్టుల వద్ద ఉద్రిక్తత



- ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వంశీ
- అదే వాయిదాకు వచ్చిన టీడీపీ సర్పంచ్ నరసయ్య
- గత ఘర్షణల నేపథ్యంలో భారీగా పోలీసు బందోబస్తు

విజయవాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : విజయవాడ కోర్టుల వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, టీడీపీ సర్పంచ్ నరసయ్య ఒకే కేసులో వాయిదాకు హాజరుకావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కోర్టు హాల్లోకి వంశీ, నరసయ్యను తప్ప ఇంకెవరినీ అనుమతించలేదు. ఇద్దరి వెనుక భారీగా వచ్చిన కార్యకర్తలను గేటు బయట నుంచి దూరంగా పంపేశారు.

గతంలో ఘర్షణ

2019లో వంశీ టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయగా, వైసీపీ నుంచి యార్లగడ్డ వెంకట్రావు పోటీ చేశారు. నాడు రిగ్గింగ్ జరుగుతుందని వెంకట్రావు ప్రసాదంపాడులోని పోలింగ్‌బూత్ వద్ద ఆందోళన చేశారు. దీనికి ప్రతిగా వంశీ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని వంశీ, నరసయ్యపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో సాగుతోంది. తర్వాత జరిగిన పరిణామాల్లో యార్లగడ్డ టీడీపీలోకి వచ్చారు. అప్పటి వరకు వంశీ వెంట అడుగులు వేసిన నరసయ్య మాత్రం టీడీపీలోనే ఉన్నారు. వంశీ వైసీపీలోకి మారారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికలకు ముందు జరిగిన కోర్టు విచారణకు వంశీ, నరసయ్య హాజరయ్యారు. కోర్టులో వంశీ అనుచరులు నరసయ్య, ఆయన డ్రైవర్‌పై దాడి చేశారు. ఇది పెద్ద దుమారానికి దారితీసింది. అప్పటి కేసులో వంశీ, నరసయ్య సోమవారం విచారణకు వచ్చారు. ఎన్నికల సమయంలో జరిగిన పరిస్థితుల నేపథ్యంలో ఇద్దరూ అనుచరులను వెంటబెట్టుకుని కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో పోలీసులు కోర్టు చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధుల కోర్టులో వంశీ, నరసయ్యను తప్ప అనుచరులను వెళ్లనీయలేదు. అనుచరులు భారీగా చేరటంతో కోర్టు వద్ద ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. కాగా, ఈ కేసు తదుపరి విచారణను వచ్చేనెల 11వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

కోర్టుకు హాజరైన దేవినేని ఉమా

పోలవరం కాల్వ వద్ద జరిగిన ఆందోళనకు సంబంధించి మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా ప్రజాప్రతినిధుల కోర్టుకు సోమవారం హాజరయ్యారు. తదుపరి విచారణను కోర్టు వచ్చేనెల ఐదో తేదీకి వాయిదా వేసింది.



ఆముదార్లంకలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

ఆముదార్లంకలో అక్రమ తవ్వకాలు

ఇసుక తరలించుకుపోతున్న గుంటూరు జిల్లా వాసులు

కృష్ణానదీ పరీవాహక గ్రామమైన చల్లపల్లి మండలం ఆముదార్లంకలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గుంటూరు జిల్లా వాసులు ట్రాక్టర్లలో తరలించుకుపోతుండటాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేయడంతోపాటు సోమవారం ట్రాక్టర్లను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని చల్లపల్లి తరలించాలని చూసినా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కొన్ని ట్రాక్టర్లు ఓలేరు వరకూ రాగా, మరికొన్ని ట్రాక్టర్లు అధికారుల కళ్లుగప్పి వెళ్లిపోయాయి. చల్లపల్లి వచ్చేందుకు ఇష్టపడక అడ్డం తిరగటంతో చేసేదేమీలేక ఇసుకను అన్‌లోడ్ చేయించి రెవెన్యూ, పోలీసు సిబ్బంది వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- గ్రామస్థుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు
- స్థానికులు, ఇసుక రవాణాదారులకు వాగ్వాదం
- చల్లపల్లి వచ్చేందుకు ససేమిరా అన్న ట్రాక్టరు డ్రైవర్లు
- ట్రాక్టర్‌లో ఇసుక రోడ్డుపక్కనే పోయించి వెనుదిరిగిన అధికారులు

చల్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం ఆముదార్లంక రేవులో నిత్యం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. గుంటూరు జిల్లా పరిధిలోని ట్రాక్టరు డ్రైవర్లు ప్రతిరోజూ ఆముదార్లంక వచ్చి ఇసుకను తవ్వుకుపోతుండటంతో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ రహదారులు దెబ్బతింటున్నాయని చెబుతున్నా పట్టించుకోకుండా ట్రాక్టర్లు చీమలదండులా ఇసుకను తరలించుకుపోవటంతో అధికారులకు ఫిర్యాదు చేసి సోమవారం ట్రాక్టర్లు బయటకు వెళ్లనీయకుండా బండలు అడ్డు వేయటంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. తహసీల్దార్ డి.వనజాక్షి, సీఐ ఈశ్వరరావులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయటంతో వీఆర్వోలు, పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. ఇసుక ట్రాక్టర్లు చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాలంటూ వీఆర్వోలు చెప్పటంతో ట్రాక్టర్ డ్రైవర్లు తొలుత ఒప్పుకోలేదు. మరోసారి ఇసుక తవ్వకాలకు రామంటూ ఒప్పించే ప్రయత్నం చేశారు. కొంత సమయం తర్వాత ట్రాక్టర్లు బయలుదేరినప్పటికీ పెనుమూడి రోడ్డు మీదకు చేరుకుని ఓలేరు వరకూ వచ్చేసరికి కొన్ని ట్రాక్టర్లు రెవెన్యూ కళ్లుగప్పి వెళ్లిపోయాయి. ఓలేరు వద్ద ట్రాక్టర్లను నిలిపివేసిన డ్రైవర్లు చల్లపల్లి వచ్చేందుకు ఇష్టపడలేదు. చల్లపల్లి వస్తే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందనీ, జరిమానాలు కట్టాల్సి వస్తుందని భావించిన ట్రాక్టర్లు డ్రైవర్లు కాలయాపన చేశారు. గంటల తరబడి తాము చల్లపల్లి రాబోమంటూ భీష్మించుకోవటంతో రెవెన్యూ యంత్రాంగం, పోలీసులు రోడ్డుపైనే పడిగాపులు పడ్డారు.

చేతులెత్తేసిన అధికార యంత్రాంగం

చల్లపల్లి వచ్చేందుకు ట్రాక్టరు డ్రైవర్లు నిరాకరించి మొండికేయడంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చేతులెత్తేసింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్‌కు వీఆర్వోలు తెలియజేశారు. తహసీల్దార్ సూచనలతో ట్రాక్టరు డ్రైవర్లు చల్లపల్లి రాకుంటే అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయానికి రావాలని చెప్పినా డ్రైవర్లు సిద్ధపడలేదు. చివరకు ఇసుకను ఆముదార్లంక తీసుకువెళ్లి అన్‌లోడింగ్ చేయాలని చెప్పినప్పటికీ ట్రాక్టరు డ్రైవర్లు



గ్రామస్థులకు, ట్రాక్టరు డ్రైవర్లకు వాగ్వాదం

సమ్మతించలేదు. సాయంత్రం వరకూ ప్రతిష్టంభన అలానే సాగింది. చివరకు రోడ్డుపైనే ఇసుకను అన్‌లోడ్ చేయించి రావాల్సిందిగా ఆదేశాలు రావటంతో ట్రాక్టర్లలో ఇసుకను రోడ్డుపై పోయించారు. ఈ వ్యవహారంలో రాజకీయ ఒత్తిళ్లు రావటంతోనే అధికారులు కఠినంగా వ్యవహరించలేదా అన్న అనుమానం తలెత్తుతోంది.

అక్రమ రవాణా ఇక్కడితో ఆగుతుందా?

ఇసుక అక్రమ రవాణా ఇక్కడితో ఆగిపోతుందన్న దాఖలాలు లేవనే చెప్పాలి. ఆముదార్లంక పరిధిలోనే మంచి ఇసుక ఉండటంతో ఇసుక తవ్వకాలకు గుంటూరు జిల్లా ట్రాక్టర్లు గ్రామానికే వస్తున్నాయి. స్థానికంగా ఉన్న వారు రోజువారీ తవ్వకాలు జరుపుతుండగా, బయటివారు పెద్దఎత్తున రావటంతో రహదారులు పూర్తిగా గోతులమయంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా బయటకు వచ్చేస్తే గుంటూరు పరిధిలోకి వెళ్లిపోతారు. పోలీసు, రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి యంత్రాంగంతో ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఈ అక్రమ తవ్వకాలపై కఠినతరంగా వ్యవహరిస్తేనే గానీ ఇసుక తరలింపు ఆగదనే చెప్పాలి.

ఇసుక ట్రాక్టర్ల వల్ల గ్రామంలో రోడ్లు దెబ్బతిన్నాయి



ఇసుక తరలింపుతో రోడ్లు దెబ్బతిన్నాయి. వరదల కారణంగా జువ్వలపాలెం - ఆముదార్లంక రోడ్డు కుంగిపోవటంతో రావద్దని చెప్పినా ట్రాక్టరు డ్రైవర్లు మాట వినటంలేదు. అదేమంటే మంత్రి గారి మనుషులం అంటున్నారు. ట్రాక్టర్లు వెళ్లకుండా బండలు అడ్డుగా వేస్తే ట్రాక్టర్లను మీరే తగలబెట్టండి అంటూ మామీదే ఎదురుదాడి చేస్తున్నారు. ఆముదార్లంకలో ఇసుక అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకోవాలి.

-మండవ నాగేశ్వరరావు, ఆముదార్లంక

8 లేన్ల విస్తరణ!

- హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్-65 అభివృద్ధికి అడుగులు
- డీపీఆర్ రూపకల్పన ప్రారంభం
- ఎన్టీఆర్ జిల్లాలో 87 కిలోమీటర్లు
- కోదాడ నుంచి గొల్లపూడి వరకు కొత్త ప్రతిపాదన
- ఆరు వరసలుగా చేయాలని ముందు నిర్ణయం
- ఆ తర్వాత 8 లేన్లకు పరిశీలించాలని నిర్దేశం
- 6, 8 వరసలపై అధ్యయనం చేస్తున్న కన్సల్టెన్సీ
- తుది డీపీఆర్ ప్రకారం ఎన్‌హెచ్ - 65 విస్తరణ

తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ - 65 విస్తరణకు అడుగు ముందుకు పడింది. ఈ మార్గాన్ని ఆరు వరసలుగా నిర్మించాలని తొలుత డీపీఆర్ రూపకల్పనకు టెండర్లు పిలిచినప్పటికీ ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదన, ప్రజా ప్రతినిధుల అభ్యర్థన, స్థానిక ప్రజల ఆకాంక్ష అయిన ఎనిమిది లేన్ల విస్తరణ అంశంపైనా ఎన్‌హెచ్ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు వాహనాల రద్దీపై కన్సల్టెన్సీ అధ్యయనం ప్రారంభించింది. తుది డీపీఆర్ ప్రకారం ఎన్‌హెచ్-65 విస్తరణ జరుగనుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్- విజయవాడల మధ్య ఎన్‌హెచ్- 65ను ఎనిమిది వరసలుగా విస్తరించాలన్న ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఎనిమిది వరసలుగా విస్తరించేందుకు ఉన్న ఫీజుబిలిటీని అధ్యయనం చేయాల్సిందిగా నిర్దేశించింది. దీంతో ఎన్‌హెచ్ అధికారులు ప్రస్తుత డీపీఆర్‌లోనే 6, 8 వరసలకు సంబంధించి ఏది అవసరమో దానిని ఖచ్చితత్వంతో నిర్దేశించాల్సిందిగా కన్సల్టెన్సీకి సూచించారు. తుది డీపీఆర్ వచ్చిన తర్వాతే ఆరు వరసలా? ఎనిమిది వరసలా అన్న దానిపై స్పష్టత వస్తుందని విజయవాడ డివిజన్ ఎన్‌హెచ్ పీడీ శ్రీధర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ప్రస్తుత అవసరాల నేపథ్యంలో విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్-65 ఎన్ని లేన్లు అవసరమో నిర్ణయించి భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని కన్సల్టెన్సీ డీపీఆర్‌ను ఇవ్వవలసి ఉంది. ప్రస్తుతం ఎన్‌హెచ్ - 65 నాలుగు వరసలుగా ఉంది. విజయవాడ -

మిగతా 6వ పేజీలో...

3న గాజుల మహోత్సవం

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నవంబరు 3 నుంచి గాజుల మహోత్సవం జరగ నుంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. పలు బృందాలు, సంఘాల నుంచి గాజుల బండిల్స్ సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కనకదుర్గా లలితా పారాయణ బృందంతో పాటు గొల్లపూడికి చెందిన ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఈవో రామారావుకు గాజుల బండిల్స్‌ను విరాళంగా అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం కల్పించి వేదాశీర్వచనం, అమ్మ వారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజే శారు. కాగా, ఆలయంలో కళావేదికపై సోమవారం బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన కె.రమాసుందరి చేసిన అమ్మ రూపవర్ణన ప్రవచనం ఆకట్టుకుంది.

మీకోసం అర్జీలు సత్వరం పరిష్కరించండి

కృష్ణా జేసీ గీతాంజలి శర్మ

కొండలా చెత్త!

సీఎం చంద్రబాబు ఆదేశాలు అమలులో జాప్యం

6లో

'డబుల్' ధమాకా

- నిడమానూరు అతిపెద్ద ఫ్లై ఓవర్‌పై మరో నిర్ణయం
- మెట్రో ఎలివేటెడ్ కమ్ ఫ్లై ఓవర్‌గా నిర్మించే యోచన
- కన్సల్టెన్సీ నియామకం.. నివేదిక ఆధారంగా నిర్ణయం
- మెట్రో అధికారులతో ఎన్‌హెచ్ వరుస సమావేశాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. మెట్రో ఎలివేటెడ్ కమ్ ఫ్లై ఓవర్‌ను నిర్మించేందుకు వీలుగా జాతీయ రహదారుల సంస్థ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌లో సాగనున్న లైట్ మెట్రో ఎలివేటెడ్ కారిడార్‌ను దృష్టిలో ఉంచుకుని ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో చర్చించారు. నాగపూర్ తరహాలో ఫ్లై ఓవర్‌పై మెట్రో ఎలివేటెడ్ కారిడార్ వచ్చేలా నిర్మించాలని నిర్ణయించారు. విజయవాడ భౌగోళిక పరిస్థితులు, నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని సాంకేతికంగా ఎలాంటి విధానంలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను చేపట్టాలన్న దానిపై కన్సల్టెన్సీ ద్వారా నివేదిక రూపొందించాలని నిర్ణయించారు. సవివర నివేదిక కోసం కన్సల్టెన్సీకి అప్పగించారు. వారిచ్చే నివేదికను పరిగణనలోకి తీసుకుని, ఫ్లై ఓవర్ డీపీఆర్ రూపొందించి, అందుకయ్యే వ్యయం, ఇతర అంశాలను క్రోడీకరిస్తారు. తుది డీపీఆర్ పూర్తయ్యాక కేంద్రానికి పంపిస్తారు. కేంద్రం నుంచి ఆమోదం రాగానే టెండర్లు పిలుస్తారు. ముందుగా సాధారణ ఆరు వరసల ఫ్లై ఓవర్ నిర్మాణం ప్రారంభమవుతుంది. లైట్ మెట్రోరైల్ పనులు చేపట్టడానికి మరికొంత కాలం పట్టే అవకాశం ఉంది. దీంతో ఫ్లై ఓవర్ పనులు ఒక దశకు వచ్చాక మెట్రో ఎలివేటెడ్ కారిడార్ పనులు జరిగే అవకాశం ఉంది.

గొల్లపూడి వద్ద సర్కిల్ రోడ్డు

విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో అంతర్భాగంగా ఎన్‌హెచ్-65, 16 కలిసే గొల్లపూడి వద్ద సర్కిల్ జంక్షన్‌ను అభివృద్ధి చేసేందుకు వీలుగా ఎన్‌హెచ్ అధికారులు కేంద్రానికి ప్రతిపాదన పంపారు. కేంద్రం నుంచి అనుమతి రావటంతో నివేదికను రూపొందించాల్సిందిగా కన్సల్టెన్సీ సంస్థను ఆదేశించారు. వారిచ్చే నివేదిక ప్రకారం ఈ ప్రాంతంలో సర్కిల్ జంక్షన్ పనులు చేపడతారు.

హైకోర్టు న్యాయవాది కిడ్నాప్ కేసులో..
నిందితులుగా డీఎస్పీ, ఎస్ఐ

- ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న డీఎస్పీ
- పిడుగురాళ్ల నుంచి పటమటకు కేసు బదిలీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ పాలనలో ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దల అండతో చెలరేగిపోయిన పోలీసులు ఇప్పుడు చిక్కుల్లో పడుతున్నారు. ఇప్పటికే ముంబై నటి కాదంబరి జెత్వాని, ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు కేసుల్లో పోలీసులు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. హైకోర్టు న్యాయవాదిని నానా ఇబ్బందులు పెట్టిన పిడుగురాళ్ల పోలీసులు కోర్టు ఆదేశాలతో నమోదైన కేసులో నిందితులుగా ఉన్నారు. పల్నాడు జిల్లా నుంచి ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ అయిన ఈ కేసులో ఓ డీఎస్పీ, ఓ ఎస్ఐ నిందితులుగా ఉన్నారు. న్యాయవాదికి సంబంధించిన ఆస్తులను వేరొకరికి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించడంలో వారి పాత్ర బలంగా ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగింది?

విజయవాడ మహానాడు రోడ్డులోని రామచంద్రనగర్‌లో ఉంటున్న హైకోర్టు న్యాయవాది హరిబాబుకు అమెరికాలో ఉంటున్న కర్నాటి సతీష్ పరిచయస్తుడు. సతీష్ తండ్రి వీరభద్రరావు గుంటూరు జిల్లా కోసూరు మండలం అందుకూరులో నివాసం ఉంటున్నారు. హరిబాబు నుంచి ఆయన రూ.2.40కోట్లు అప్పుగా తీసుకున్నారు. అందులో 2018, 2019 ఏప్రిల్‌లో రెండు విడతలుగా రూ.1.40కోట్లు తిరిగి ఇచ్చేశారు. మిగిలిన మొత్తం త్వరలో ఇస్తానని స్టాంపు పేపర్ రాసిచ్చారు. తర్వాత ఎంతకీ డబ్బులు ఇవ్వకపోవడంతో హరిబాబు గట్టిగా నిలదీశారు. దాంతో అమెరికాలో ఉన్న సతీష్, అందుకూరులో ఉంటున్న వీరభద్రరావు కలిసి రాజకీయ బలాన్ని ఉపయోగించి గడచిన ఏడాది నవంబరు 7వ తేదీన హరిబాబుపై పిడుగురాళ్ల స్టేషన్ కేసు నమోదు చేయించారు. అప్పటి గురజాల డీఎస్పీ పల్లంరాజు ఈ కేసు పర్యవేక్షణ బాధ్యతను భుజాన వేసుకుని మొత్తం కథను నడిపించారని హరిబాబు ఆరోపిస్తున్నాడు. కేసు నమోదు చేయగానే పిడుగురాళ్ల ఎస్ఐ ఎస్కే రబ్బాని, కానిస్టేబుల్ వెంకటరావు విజయవాడ చేరుకుని హరిబాబుతో పాటు ఆయన సోదరులను తీసుకెళ్లారు. పిడుగురాళ్ల సీఐ కార్యాలయంలో ఉంచి వీరభద్రరావు ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చారు. ఇప్పటికే అధిక వడ్డీతో చాలా ఎక్కువ వసూలు చేశావని హరిబాబును బెదిరించారు. వీరభద్రరావు ఇక ఏమీ డబ్బులు ఇవ్వడని కేసును సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఒత్తిడి చేశారు. తర్వాత హరిబాబుకు కుంటముక్కలలో ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిని దగ్గరుండి వీరభద్రరావు విజయవాడలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది కాకుండా అతడు బ్యాంకులో పొదుపు చేసుకున్న డబ్బులను బయటకు తీయించారు. దీనిపై హరిబాబు గుంటూరు ఐజీకి ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం డీఎస్పీ పల్లంరాజుపై వేటు వేశారు. పిడుగురాళ్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడంతో ఆయన విజయవాడలోని నాలుగో ఏసీఎంఎం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పిడుగురాళ్ల పోలీసులు కర్నాటి వీరభద్రరావును ప్రధాన నిందితుడిగా, డీఎస్పీ పల్లంరాజు రెండో నిందితుడిగా చేర్చుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారితోపాటు ఏ3గా ఎస్ఐ రబ్బాని, ఏ4గా వెంకటేశ్వరరావు, ఏ5గా బాలునాయక్, ఏ6 నాగూర్‌వలీ, ఏ7గా కర్నాటి సతీష్‌లను చేర్చారు. పిడుగురాళ్ల పోలీసులు తూతూమంత్రంగా సెక్షన్లు వేశారు. దీనిపై హరిబాబు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. పిడుగురాళ్ల పోలీసులపై తనకు నమ్మకం లేదని, కేసును విజయవాడకు బదిలీ చేయాలని పిటిషన్‌లో కోరారు. కేసులో కిడ్నాప్, బెదిరింపులకు సంబంధించిన సెక్షన్లు నమోదు చేయలేదని వివరించారు. దీనిని పరిశీలించిన కోర్టు కేసును పిడుగురాళ్ల నుంచి హరిబాబు నివాసం ఉంటున్న పటమట పీఎస్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. పటమట పోలీసులు కోర్టు ఆదేశాల ప్రకారం సెక్షన్లను జత చేశారు.

దర్యాప్తు జరుగుతోంది : వి.పవన్ కిషోర్, పటమట ఇన్‌స్పెక్టర్

ఈ కేసు గురజాల నుంచి పటమటకు బదిలీ అయింది. కోర్టు ఆదేశాల ప్రకారం కొన్ని సెక్షన్లను చేర్చాం. ఈ కేసు దర్యాప్తులో ఉంది. ఫిర్యాదులో ఉన్న అందరు నిందితులుగా ఉన్నారు. ఇందులో ముగ్గురు పోలీసులున్నారు. దర్యాప్తు పూర్తవగానే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.



- పట్టణంలో రోజూ 84 మెట్రిక్ టన్నులు సేకరణ
- నిలిచిపోయిన చెత్త సేకరణ వాహన సేవలు
- తాత్కాలికంగా 10 ట్రాక్టర్లతో సేకరణ, కార్మికులపై పనిభారం
- యార్డు సమీప కాలనీల్లో ప్రజలకు రోగాల భయం
- గుంటూరు జిందాల్ కంపెనీకి తరలింపులోనూ జాప్యం
- సీఎం చంద్రబాబు ఆదేశాలు అమలులో జాప్యం!

కొండలా చెత్త!
సంపద సృష్టి జరిగేనా

మచిలీపట్నంలో డంపింగ్ యార్డు

మచిలీపట్నం డంపింగ్ యార్డులో లక్ష టన్నుల చెత్త నిల్వలు కొండలా పేరుకుపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త సేకరణ వాహనాల కాంట్రాక్టర్ సేవలు నిలిపివేయడంతో నగరంలోని పది ట్రాక్టర్లతోనే చెత్తను తరలిస్తున్నారు. దీంతో పారిశుధ్య కార్మికులపై పనిభారం పెరిగింది. ఇటీవల సీఎం చంద్రబాబు బందరు పర్యటనలో చెత్త నుంచి సంపద సృష్టించి డంపింగ్ యార్డు స్వరూపమే మార్చేస్తామని చెప్పినా.. ఆ మేరకు అడుగులు పడటం లేదు.

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం టౌన్)

మచిలీపట్నంలోని 50 డివిజన్లలో ప్రతిరోజూ 84 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిందాల్ కంపెనీకి ప్రతి రోజూ 18 టన్నుల చెత్తను పంపుతున్నారు. అయితే కాంట్రాక్టర్ కాల పరిమితి ముగియడంతో గుంటూరుకు చెత్తను తీసుకువెళ్లడం ఆపేశాడు. దీంతో డంపింగ్ యార్డు వద్ద చెత్త ఎగిరిపడే పరిస్థితి ఏర్పడింది. వర్షానికి రోడ్లపైకి చెత్తతో వర్షపునీరు కొట్టుకు వస్తోంది. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికులకు వీధుల్లోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం సవాల్‌గా మారింది.



డంపింగ్ యార్డును సందర్శించిన చంద్రబాబు(ఫైల్)

● సీఎం చంద్రబాబు ఇటీవల మచిలీపట్నం డంపింగ్ యార్డును సందర్శించిన అనంతరం యార్డు రూపురేఖలు మారుతున్నాయని అందరూ భావించారు. చెత్త నుంచి సంపదను సృష్టించాలని చంద్రబాబు పాలకులు, అధికారులను ప్రజాదర్బార్‌లో ఆదేశించారు. అయితే చెత్తను సేకరించే వాహనాలు నిలిపివేయడంతో పాటు గుంటూరుకు చెత్తను తరలించే కాంట్రాక్టర్ కాల పరిమితి ముగియడంతో డంపింగ్ యార్డు వద్ద కొండల మాదిరిగా చెత్త పేరుకుపోయే పరిస్థితి ఏర్పడింది.

జనాభాతో పాటు పెరుగుతున్న చెత్త..

మచిలీపట్నంలో 58 వేల ఇళ్ల నుంచి ప్రతి రోజూ 84 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. తడి చెత్త, పొడి చెత్త కోసం డస్ట్‌బిన్‌లను ప్రతి కుటుంబానికి ఇచ్చినప్పటికీ ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. వైసీపీ ప్రభుత్వంలో నగర పాలక సంస్థకు 41 చెత్త సేకరించే వాహనాలు అందజేసింది. వాహనాలకు మచిలీపట్నం మునిసిపాలిటీ రూ.కోటి 30 లక్షల బకాయిలుండటంతో వాహనాల సేవలు నిలిచిపోయాయి. దీనికి ప్రత్యామ్నాయంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పది ట్రాక్టర్లతో నగరంలో చెత్త సేకరణ..

నగరంలోని 50 డివిజన్ల నుంచి పది ట్రాక్టర్లతో చెత్తను సేకరిస్తున్నా పని సక్రమంగా సాగడంలేదు. మరిన్ని ట్రాక్టర్లను ఏర్పాటు చేయవలసి ఉంది. గతంలో ఒకటి రెండు ట్రిప్పులు వేసే ట్రాక్టర్లు ఇప్పుడు మూడు నాలుగు ట్రిప్పులు వేయాల్సి వస్తోంది. పారిశుధ్య కార్మికుల కొరత ఉంది. మచిలీపట్నంలో చెత్తను వేసే 50 డంపర్‌బిన్‌లలో 25 పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాల్సి ఉంది.

కార్పొరేషన్‌పై అధిక భారం..

వైసీపీ పాలనలో చెత్త సేకరణపై ఒక్కొక్క కుటుంబం నుంచి రూ. 30 నుంచి రూ.90 చొప్పున నెలకు సుమారు రూ. 25 లక్షల వరకు వసూలు చేసేవారు. అయితే కాంట్రాక్టర్‌కు బకాయిలు రూ.కోటి 30లక్షల వరకు పేరుకుపోయాయి. ప్రజలపై చెత్త పన్ను నిలిపివేయడంతో కాంట్రాక్టర్‌కు జనరల్ ఫండ్స్ నుంచి కోటి 30 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. ఇంత పెద్ద మొత్తంలో నగర పాలక సంస్థ చెల్లించే పరిస్థితి లేదని అధికారులే చెబుతున్నారు.

చెత్త నుంచి సంపద ఒక్కటే మార్గం

నగరంలో రోజుకు వస్తున్న 84 మెట్రిక్ టన్నుల చెత్త నుంచి ఆదాయం సంపాదించాలని సీఎం చంద్రబాబు ఇటీవల మచిలీపట్నం పర్యటనలో చెప్పారు. చెత్త నుంచి ఏ విధంగా ఆదాయం సంపాదించాలో అధికారులు, పాలకులకు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపదను రాబడితే ట్రాక్టర్లు, డంపర్‌బిన్‌లు, డస్ట్‌బిన్‌లు కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. కొన్ని ప్రాంతాల్లో చెత్త నుంచి వర్మి కంపోస్టు ఎరువులను తయారు చేస్తున్నారని, చెత్తను ఇతర ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని చంద్రబాబు తెలిపారు. ఆ దిశగా పాలకులు, అధికారులు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమస్యకు పరిష్కారం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్త సమస్యకు సరైన పరిష్కారం ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాల ద్వారా కొన్ని సూచనలు చేసింది. చెత్తను సంపదగా రూపొందించేందుకు మునిసిపాలిటీలకు సాయం అందించేందుకు ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో చెత్తనుంచి సంపద సేకరించే మార్గాలు అన్వేషించాల్సి ఉంది.

డంపింగ్ యార్డుతో కాలనీవాసుల కష్టాలు..

డంపింగ్‌యార్డు వెనుక 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. యార్డు నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళి ఇళ్ల మీద పడటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో డంపింగ్ యార్డుకు, కాలనీకి మధ్య గోడ కట్టేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాలనీ వాసులతో పాటు ఎస్.ఎన్. గొల్లపాలెం, సీతారామపురంలకు వెళ్లే ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.



మూలన చేరిన చెత్త సేకరణ వాహనాలు

డంపింగ్ యార్డు స్వరూపం మార్చేస్తాం : రవీంద్ర




డంపింగ్ యార్డు సమస్యను సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా వీక్షించారు. ఒక్కొక్క వాహనానికి నెలకు రూ. 55వేలు చెల్లించాల్సి వస్తోంది. వాహనాలు తిప్పకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. చెత్త సేకరించేందుకు ట్రాక్టర్లు కొనుగోలు చేయనున్నాం. యార్డు వెనుక కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తాం. రుద్రవరం వద్ద 13 ఎకరాల స్థలం కొనుగోలు చేసి డంపింగ్ యార్డును తరలిస్తాం. ఏడాదిలోగా యార్డు స్థలంలో పార్కును ఏర్పాటు చేసి చంద్రబాబుకు చూపిస్తాం.

డంపింగ్ యార్డును తరలించాలి
– కుంభ శివమ్మ, కాలనీ వాసి



డంపింగ్ యార్డు వెనుక 20 ఏళ్ల నుంచి 200 కుటుంబాలు నివశిస్తున్నాయి. ఎప్పటికప్పుడు యార్డును వేరేచోటకు తరలిస్తామని చెబుతున్నా.. కార్యరూపం దాల్చడం లేదు. ఏళ్ల తరబడి చెత్త, పొగను భరిస్తున్నాం. కాలనీలో చాలా మంది రోగాలబారిన పడుతున్నారు. పాలకులు, అధికారులు దృష్టి సారించాలి.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం
– బాపిరాజు, కమిషనర్



డంపింగ్ యార్డుకు చెత్త సేకరణ వాహనాలు తిప్పేందుకు గత కాంట్రాక్టర్ సుముఖత వ్యక్తం చేశారు. కొన్ని వాహనాలు ఇప్పటికే తిరుగుతున్నాయి. ప్రస్తుతం పది ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డుకు పంపుతున్నాం. చెత్త నుంచి సంపద రావడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నాం.



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా జూనియర్స్ బాలుర ఖో-ఖో జట్టు

ఖోఖో పోటీల్లో కృష్ణా జట్టుకు ద్వితీయ స్థానం

గుడివాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా, కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 43వ రాష్ట్ర జూనియర్స్ బాలబాలికల ఖో-ఖో పోటీల్లో జిల్లా జూనియర్స్ బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మడకా ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్‌లు తెలిపారు. చిత్తూరు ఎంపీ గరిమెళ్ల ప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడులు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలుర జట్టును అసోసియేషన్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ డీవైఈవో పద్మారాణి, జిల్లా కామన్ బోర్డు కార్యదర్శి షేక్ జానీసాహెబ్, ఎస్‌పిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుని టి.రాణి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

40 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలుచోట్ల దొంగిలించబడిన రూ.47లక్షల విలువైన 40 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. ఎస్పీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో మచిలీపట్నం, పెడనతో పాటు జిల్లాలోని పలుప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీలపై ఫిర్యాదులు అందాయన్నారు. పోలీసులు నిఘా ఉంచి ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న వారి కదలికలను కనిపెట్టి, వారినుంచి 40 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మచిలీపట్నంకు చెందిన మహ్మద్‌కైఫ్, ఎస్కే ఫరాన్, మహ్మద్‌ఫరీద్, పెడన నందమూరుకు చెందిన నామన శ్రీనివాసరావు, పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన మోకా దుర్గారావు ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్నట్టుగా గుర్తించడం జరిగిందన్నారు. వీరు జల్సాలకు అలవాటుపడి ద్విచక్రవాహనాలను దొంగిలించి, విక్రయిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ద్విచక్రవాహనాలను దొంగిలించిన కేసులో నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరచనున్నట్టు తెలిపారు. ద్విచక్రవాహనాల దొంగలను పట్టుకున్న బందరు డీఎస్పీ అబ్దుల్ సుబాన్, బందరుతాలూకా సీఐ ఏసుబాబు, తాలూకా ఎస్ఐ కె.నాగరాజు, పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్ఐ జి.సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందజేశారు.

మచిలీపట్నం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా టీటీకే రెడ్డి

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా టీటీకే రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఆయన గుంటూరు జీఎంసీ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. మచిలీపట్నం ప్రిన్సిపాల్ ఎస్వీ సుందరాచారిని గుంటూరు జీఎంసీ ప్రిన్సిపాల్‌గా బదిలీఅయ్యారు.

మీకోసం అర్జీలు సత్వరం పరిష్కరించండి

- కృష్ణా జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదిక (మీకోసం) కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జేసీ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో కె.స్వాతి, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవితో కలిసి ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. జిల్లా నుంచి వచ్చిన 128మంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, అధికా



విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

రులకు పంపిన అర్జీలను పూర్తిగా పరిశీలించి, వివరాలను కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందించాలన్నారు. ప్రస్తుతం 108 అర్జీలు సీఎం కార్యాలయం నుంచి వచ్చాయని, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి ఇప్పటివరకు 811అర్జీలు అందగా, వాటిలో 51శాతం రెవెన్యూశాఖకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. జలవనరులశాఖ 16, రెవెన్యూకు సంబంధించి ఏడు కోర్టుధిక్కరణ కేసులు ఉన్నాయని, వెంటనే వాటికి వకాలత్‌లు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ప్రారంభమై, నవంబరు 3వతేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో, అవినీతిని అరికట్టేందుకు అందరం కృషి చేద్దామని అధికారులతో జేసీ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో మాట్లాడుతూ, సమాచారహక్కు చట్టం ద్వారా 26శాఖలకు చెందిన అధికారులు సమాచారం ఇవ్వాల్సి ఉందని, వెంటనే అందజేయాలన్నారు. వసతిగృహాల్లో ఉంటున్న పిల్లలకు దుప్పట్లు, చాపలు ఇచ్చేందుకు అధికారులు ఆర్థికసాయం చేసేందుకు ముందుకువస్తే, వారంలోగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, గృహ నిర్మాణశాఖ అధికారి వెంకట్రావ్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి, డీసీహెచ్‌ఎస్ శ్రావణ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీపైనా దృష్టి పెట్టండి

- ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి నిర్దేశ



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు తెలుసుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌నిధి మీనా

గడువులోగా సరైన పరిష్కారం చూపేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నిధి మీనా అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు తదితరులతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధిమీనా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టిసారించడం జరుగుతోందని, జిల్లాస్థాయి అధికారులు సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు అర్జీల పరిష్కారానికి సంబంధించిన పురోగతిపై ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 157 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉచిత గ్యాస్

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు సర్వం సిద్ధం చేసింది. ఉచిత గ్యాస్ పొందేందుకు ఈ నెల 29నుంచి 31 వరకు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు జేసీ గీతాంజలి శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ క్రమం తప్పకుండా తీసుకుంటున్నవారు. వారి ఆధార్ నెంబరు, బియ్యం కార్డు, ఆధార్‌నెంబరుతో లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతా నంబర్లతో గ్యాస్ బుకింగ్ చేసుకుని, నగదును గ్యాస్ ఏజెన్సీకి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉచిత సిలిండర్‌కు సంబంధించి నగదును వినియోగదారుల బ్యాంకుఖాతాల్లో రెండురోజుల్లోగా జమ చేస్తారని జేసీ తెలిపారు. ప్రతినాలుగు నెలలకు ఒకసారి చొప్పున ఏప్రిల్ నుంచి జూలై నెలవరకు, ఆగస్టు నుంచి నవంబర్ నెలవరకు, డిసెంబర్ నుంచి మార్చి నెలవరకు మూడు విడతల్లో ఉచితగ్యాస్ సిలిండర్‌లను బుక్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం ఇచ్చిందని జేసీ తెలిపారు.

ఐటీఐలో కౌన్సెలింగ్ పూర్తి

భారతీనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను 5వ విడత కౌన్సెలింగ్ సోమవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగింది. కౌన్సిలింగ్‌కు 29 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16 మంది హాజరయ్యారు. వారిలో 16 మందికి వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లు కేటాయించారు. ఈ సంవత్సరానికిగాను జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు మొత్తం 716సీట్లు ఖాళీ ఉండగా ఇప్పటి వరకు 96 శాతం సీట్లు భర్తీ అయ్యాయని ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.

బాణాసంచా గోడౌన్‌లో చోరీ

గన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కోనాయి చెరువు సమీపంలోని ఓ బాణాసంచా విక్రయ గోడౌన్‌లో దొంగలు చొరబడి సుమారు రూ.1.25లక్షల విలువైన సరుకు అపహరించుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల సమాచారం ప్రకారం.. శ్రీ దుర్గాభవాని ఫైర్‌వర్క్స్ ఏజెన్సీకి చెందిన గోడౌన్‌లో బాణాసంచా విక్రయాలు జరుగుతున్నాయి. దీపావళికి భారీగా సరుకు నిల్వ చేశారు. ఎప్పటిలాగానే తాళాలు వేసి వెళ్లిపోయారు.ఆదివారం ఉదయం 3.20గంటల సమయంలో గోడౌన్ వెనుక నుంచి పైకప్పును తొలగించి నలుగురు యువకులు లోనికి ప్రవేశించారు. గోడౌన్‌లోని ఖరీదైన సామగ్రిని అపహరించుకుపోయారు. ఉదయం గోడౌన్ తెరిచిన యజమాని గొంట్ల యజ్ఞనారాయణ చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చోరీకి గురైన సరుకు రూ.1.25లక్షలు ఉంటుందని నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

8 లేన్ల విస్తరణ!

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్ మార్గంలో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంది. ఈ రద్దీ కారణంగా రెండు నగరాల మధ్యన ప్రయాణం ఐదు గంటలకుపైగా సమయం పడుతోంది. వారాంతాలు, ప్రత్యేక సందర్భాలు, పండుగల వేళ అయితే ఇక చెప్పనక్కర లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌హెచ్-65ను ఆరు వరసలుగా విస్తరించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో వస్తుంది. ప్రస్తుత పరిస్థితులలో ఆరు వరసలుగా విస్తరించినా.. సరిపోదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ప్రస్తుత అవసరాల రీత్యా ఆరు వరసలు చేయడం తథ్యం. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపేటటు వంటి జాతీయ రహదారి కావటంతో ఖచ్చితంగా దీర్ఘకాలిక అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని చూస్తే కన్సల్టెన్సీ సంస్థ ఎనిమిది వరసలుగా విస్తరించేందుకు ప్రతిపాదించే అవకాశం కనిపిస్తోంది.

వాహన రాకపోకల గణన ప్రారంభం

హైదరాబాద్ - విజయవాడల మధ్య వాహనాల రద్దీపై కన్సల్టెన్సీ సంస్థ అధ్యయనం ప్రారంభించింది. ఇందులో భాగంగా కలకత్తా నుంచి హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలతో పాటు, మచిలీపట్నం, గుంటూరు మీదుగా వచ్చే వాహన రాకపోకలపై అధ్యయనం చేపట్టింది. దీని కోసం ఇంజనీరింగ్ విద్యార్థులతో టోల్‌గేట్ల దగ్గర వాహన గణాంకాలను నమోదు చేయిస్తున్నారు. వాహనాల రద్దీ ప్రాతిపదికన కూడా ఎనిమిది వరసలుగా విస్తరించే అంశంపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో కీసర, చిల్లకల్లు టోల్‌గేట్ల దగ్గర, కృష్ణాజిల్లాలో పొట్టిపాడు టోల్ ప్లాజా, దావులూరు టోల్‌ప్లాజాల దగ్గర వాహన లెక్కలు తీస్తున్నారు. ఈ అధ్యయనానికి సంబంధించి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. విజయవాడ - హైదరాబాద్ మార్గంపై వాహనాల రద్దీని తెలుసుకోవటమనేది ఒకటైతే.. ఈ వాహనాల ఆధారంగా టోల్ చార్జీల వసూలు అంచనాలకు రావడం మరో కారణం.

87 కిలో మీటర్ల మేర ఎన్‌హెచ్-65 విస్తరణ

విజయవాడ-హైదరాబాద్‌ల మధ్య ఎన్‌హెచ్-65 విస్తరణ ఎన్టీఆర్ జిల్లాలో 87 కిలోమీటర్ల మేర సాగనుంది. విజయవాడను ఆనుకుని గొల్లపూడి నుంచి కోదాడ వరకు 6/8 వరసలుగా విస్తరించనున్నారు. గతంలో కోదాడ నుంచి నందిగామ వరకు మాత్రమే 6 వరసల విస్తరణ ప్రతిపాదన ఉంది. నందిగామ వరకు విస్తరించటం కంటే విజయవాడ దగ్గర వరకు తీసుకురావటం మంచిదన్న ప్రతిపాదనలు రావటంతో.. ఎన్‌హెచ్ అధికారులు కూడా గొల్లపూడి వరకు పొడిగించారు. ఈ మేరకు డీపీఆర్ తయారు చేయాల్సిందిగా కన్సల్టెన్సీ సంస్థకు కూడా నిర్దేశించారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వొద్దు

మచిలీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌లో ధాన్యం సేకరణ సజావుగా చేసేందుకు అధికారులు అన్నిచర్యలు తీసుకోవాలని డీఎస్‌వో పార్వతి, పౌరసరాలసంస్థ జిల్లా మేనేజర్ సృజన అన్నారు. జిల్లాపరిషత్ సమావేశపు హాలులో సోమవారం ధాన్యం సేకరణలో తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం సేకరణలో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ మొబైల్‌యాప్‌ను ఉపయోగించే తీరును పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ధాన్యం సేకరణలో కస్టోడియన్ అధికారులుగా వీఆర్వోలు, వాహనాల కదలిక పర్యవేక్షణ అధికారులుగా డిప్యూటీ తహసీల్దార్లు వ్యవహరిస్తారన్నారు. ఉదయం 8 గంటలనుంచి రాత్రి 8 గంటలవరకు రెండు షిఫ్టుల్లో వీరు పనిచేయాల్సి ఉందన్నారు. ధాన్యంలో తేమశాతం, రకం, వాహన లోడింగ్, అన్‌లోడ్ సమయం, మిల్లుపేరు తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదుచేయాలని సూచించారు. సాధారణరకం ధాన్యం క్వింటాలుకు మద్దతుధర రూ.2,300లు, గ్రేడ్-ఏ రకం ధాన్యం మద్దతుధర రూ.2,320లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

పరిహారం చెల్లింపు అంచనాల్లో లోపాలు

- కలెక్టరేట్ వద్ద రైతుల నిరసన

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరదలు, భారీ వర్షాల వల్ల నష్టపోయిన సన్న, చిన్నకారు రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో తయారు చేసిన అంచనాల జాబితాల్లో పలు లోపాలు ఉన్నాయని, మళ్లీ విచారణ జరిపి వాస్తవంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలంటూ బావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, పలువురు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు మండలి ఉదయభాస్కర్, నంగేగడ్డ మాజీ సర్పంచ్ బావిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎ.రామారావులు మీడియాతో మాట్లాడారు. బావదేవరపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో బావదేవరపల్లి, కమ్మనమోలు, చోడవరం, మత్రిపాలెం, నాగాయలంక, వక్కపట్లవారిపాలెం, తుంగలవారిపాలెం, వేకనూరు, నంగేగడ్డ, సంగమేశ్వరం గ్రామాల్లో పొలాలు ముంపుకు గురయ్యాయని, నష్టపరిహారం కోసం అంచనాలు వేసిన సందర్భంలో వాస్తవంగా నష్టపోయిన రైతుల పేర్లు రాయకపోవడం వల్ల నష్టపరిహారం అందలేదన్నారు. ఎకరాకు రూ.10 నుంచి రూ. 15 వేల వరకు ఖర్చయిందని, రీ ఎంక్వయిరీ చేయించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

కోలవెన్ను చానల్ పనుల పరిశీలన

కంకిపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సాగు కాలువల పూడికతీత పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కృష్ణా కెనాల్ డీఈ రవికిరణ్ ఆదేశించారు. కంకిపాడు ఒకటవ తూము వద్ద కోలవెన్ను చానల్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోలవెన్ను చానల్ పరిధిలో కంకిపాడు, పునాదిపాడు, గొల్లగూడెం, కోలవెన్ను గ్రామాల పరిధిలో రైతులకు సాగునీరుకు ఇబ్బంది లేకుండా పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సార్వాలో వరిసాగు కోతకు దగ్గరపడిందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ నాగబాబు, సిబ్బంది నాగరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బోడె చొరవతో ఫలించిన చర్చలు

● నేటి నుంచి విధుల్లోకి చెత్త సేకరణ వ్యాన్ల డ్రైవర్లు

పెనమలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తమ పెండింగ్ జీతాల కోసం గత రెండు వారాలుగా చెత్త సేకరణ ఆపేసిన వ్యాన్ల డ్రైవర్లు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అయితే స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మునిసిపల్ కమిషనరుతో చర్చించి మునిసిపాలిటీ నిధుల నుంచి జీతాల చెల్లింపులకు నలభై లక్షల రూపాయల విడుదలకు కృషి చేశారు. వ్యాన్ల డ్రైవర్ల జీతాల చెల్లింపులకు ఆ నిధులు వినియోగించాలని ఎమ్మెల్యే మునిసిపల్ అధికారులకు సూచించారు. వచ్చే వారంలో మిగిలిన నిధులను కూడా విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో వ్యాన్ల డ్రైవర్ల సమ్మె నిన్నటితో ముగిసినట్లయింది. నేటి నుంచి వ్యాను డ్రైవర్లు విధుల్లోకి రానున్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సామూహిక శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు వ్రత కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వ్రతం పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులు పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈవో వై.శ్రీనివాస్, సిబ్బంది పర్యవేక్షించారు.



జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బోడె మనోజ్

ఘనంగా బోడె మనోజ్ జన్మదినం

పెనమలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్ (సన్నీ) జన్మదిన వేడుకలు సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఇంట ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు బోడె మనోజ్‌కు శుభాకాంక్షలు తెలపడానికి పోటెత్తారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, బోడె సురేష్, బోడె హేమ చౌదరి, యువనాయకులు బోడె వెంకట్రామ్, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షులు కోయ ఆనంద్ ప్రసాద్, పార్టీ సమన్వయకర్త చిన్నారి తదితరులు మనోజ్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

టపాసులు జాగ్రత్తగా కాల్చాలి

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు సుశాంక్ బలేరావు

పెనమలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన టపాసులు, ఇతర మందుగుండు సామగ్రి కాల్చేటప్పుడు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాడిగడప ఎల్వీప్రసాద్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుశాంక్ బలేరావు సూచించారు. ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడుతూ, కంటికి గాయమయితే చేయవలసినవి, చేయకూడని వాటి గురించి సూచనలిచ్చారు. టపాసులు కాల్చేప్పుడు కేవలం మందంగా ఉన్న నూలు దుస్తులు మాత్రమే ధరించాలని సూచించారు. కంటికి గాయమైన సందర్భంలో వెంటనే వైద్య సాయం పొందాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

ఉంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికై గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామసభలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఐ బి.సూర్యకాంతి అన్నారు. మండలంలోని నాగవరప్పాడులో రెవెన్యూ సర్వే అధికారుల సమక్షంలో సోమవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో మళ్లీ గ్రామసభలను నిర్వహించి అభ్యంతరాలుంటే స్వీకరించాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలమేరకు ప్రతి గ్రామంలో పకడ్బందీగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీఆర్వో ఏ.చైతన్యకుమార్, గ్రామసర్వేయర్ భాస్కర్, వీఆర్యే ప్రసన్న పాల్గొన్నారు.





ఎస్ ఎన్ పాలెంలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదులో పార్టీ బీసీ సంఘ నాయకులు.. అంబాపురంలో.. కానూరులో

టీడీపీతోనే యువతకు భవిత

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామళ్ల సూర్యం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతున్న యువతకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పించడానికి కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామళ్ల సూర్యం తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం జంక్షన్ పట్టణ టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పుట్టా సురేష్, నాయకులు గార్లపాటి రాజేశ్వరరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, దయాల రాజీవ్ కాంత్, మొవ్వా వేణుగోపాల్, కడవకొల్లు రాజేష్, కర్రా ప్రసాద్, సంగ్రామ్, వార్డు సభ్యులు తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు నాగరాజు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సభ్యత్వ నమోదుతో కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని గన్నవరం నియోజకవర్గ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కంపసాటి కొండలరావు తెలిపారు. ఎస్. ఎన్.పాలెం, బొమ్ములూరు గ్రామాల్లో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్.ఎన్.పాలెంలో సీనియర్ నాయకుడు చెన్నుబోయిన వెంకటనారాయణ, మేకల సాంబశివరావు, మత్తి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అంబాపురంలో..

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో సోమవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. గ్రామంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు హాజరై సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ నేతలు గొడ్డళ్ల సత్యనారాయణ, చల్లగాలి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో..

పెనమలూరు : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కానూరు వెలగపూడి కోల్డ్ స్టోరేజిలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, తాడిగడప టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలగపూడి, అనుమోలు మాట్లాడుతూ, సభ్యత్వాన్ని కేవలం వంద రూపాయలతో పొంది సాధారణ మరణం వల్ల పదివేలు, ప్రమాద మరణం వల్ల ఐదు లక్షల బీమా పొందవచ్చన్నారు. వార్డు అధ్యక్షుడు షేక్ సమీర్, ఇమాం, కొండ, పీ రమేష్, బచ్చన్, కే రమేష్ పాల్గొన్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి

● కంకిపాడు - గుడివాడ రోడ్డు అభివృద్ధి కోరుతూ సీపీఎం పాదయాత్ర

కంకిపాడు/ ఉంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అధ్వానంగా మారిన కంకిపాడు - గుడివాడ రహదారిని అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. కంకిపాడు నుంచి గుడివాడ వరకు అధ్వానంగా ఉన్న రహదారి అభివృద్ధి చేయాలంటూ కోమటిగుంట లాకుల నుంచి గుడివాడ ఆర్డీవో ఆఫీసు వరకు చేపట్టిన పాదయాత్రను సీపీఎం సీనియర్ నాయకులు వేమూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వై. నరసింహారావు మాట్లాడుతూ, పెనమలూరు, గన్నవరం, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల పరిధిలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారి అనేక సంవత్సరాలు అవుతున్నా రహదారి అభివృద్ధికి ప్రభుత్వాలు పనిచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరి శివనాగేంద్రం, లక్ష్మణస్వామి, పంచకర్ల రంగారావు, కార్యదర్శులు తాడంకి నరేష్, వెంకటేశ్వరరావు, గంగాధర్, రాజేష్, రెడి పాల్గొన్నారు.



కంకిపాడు - గుడివాడ రోడ్డు అభివృద్ధి చేయాలంటూ సీపీఎం చేపట్టిన పాదయాత్రను ప్రారంభిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు వేమూరి నాగేశ్వరరావు

మానికొండ వద్ద ఘనస్వాగతం

అడుగడుగునా గోతులమయమై, ప్రమాదకరంగా మారిన కంకిపాడు- మానికొండ- గుడివాడ రహదారిని అభివృద్ధి చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో కోమటిగుంట లాకుల నుంచి గుడివాడ ఆర్డీవో ఆఫీసువరకు పార్టీ నేతలు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఎర్రజెండాలు చేతబూని ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూ సాగుతున్న పాదయాత్రకు మండలంలోని మానికొండ వద్ద స్థానిక సీపీఎం నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులందరూ కలిసి పాదయాత్రను ముందుకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి, పంచకర్ల రంగారావు, అజ్మీర్ వెంకటేశ్వరరావు, మేకల పార్వతీశ్వరరావు, సత్యనారాయణ, సుందరం పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ఉంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): బుడమేరు వరదల్లో పొలాలు, ఇళ్లు నీటమునిగి ఇంకా నష్టపరిహారం అందని బాధితులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం అందించి ఆదుకోవాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వరద బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి, ఆ పార్టీ మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు సీపీఎం నాయకులు కంచర్ల విష్ణు, గుండే ప్రసాద్, రమేష్, ఆశాజ్యోతి, నీలిమకుమారి, రత్నకుమారి, శివకోటేశ్వరరావు, బొకినాల నిరీక్షణరావు, రైతులు, వరద బాధితులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు, వరద బాధితులు

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ఉయ్యూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పమాల వేసుకునేందు తల్లి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో పురుగుల మందుతాగి యువకుడు ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసుల వివరాల ప్రకారం స్థానిక కాపుల రామాలయం సమీపాన నివసించే కూనపరెడ్డి రేవంత్ మల్లిక్ (26) డిగ్రీ వరకు చదువుకుని ఎలక్ట్రీషియన్, క్యాటరింగ్ పనులు చేస్తూ ఉంటాడు. అయ్యప్పమాల వేసుకునేందుకు రూ. 20వేలు ఇవ్వాలని తల్లిని అడగగా ఆమె నిరాకరించడంతో పురుగుల మందు తాగాడు. చుట్టపక్కల వారు అతనిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



అమెరికాలో మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అమెరికాలో మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం

గన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అమెరికాలోని ఆస్టిన్ విమానాశ్రయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో ఎన్నారై టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో ఐటీ సంస్థల ఏర్పాటు కోసం పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో టెస్లా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించేందుకు ఆస్టిన్ చేరుకోగా విమానాశ్రయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పూలబొకే అందజేసి శాలువ కప్పి స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, అభిమానులు ఎన్నారై తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.



కార్తీక దీపం

దెబ్బతిన్న భవానీ ఐల్యాండ్‌ను వేగంగా పునరుద్ధరించటం సాధ్యమేనా..?

- పట్టుదలతో ముస్తాబు చేస్తున్న అధికారులు
- టవర్ వద్ద కోతకు గురైన ప్రాంతంలో ఇసుక బస్తాలు
- పాత్‌వేలు, లాన్లు ఇప్పటికే సిద్ధం
- నవంబరు 1 నాటికి అందుబాటులోకి..!
- బుకింగ్స్ పెరగటంతో ఆనందంలో అధికారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: కార్తీక మాసానికి వేదికయ్యేందుకు భవానీ ఐల్యాండ్ ముస్తాబౌతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భవానీ ఐల్యాండ్‌లో అనేక ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేయడంతో ఆ ఐదేళ్ల సందర్శకులతో ఐల్యాండ్ పోటెత్తింది. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్లలో మొదటి ఏడాది వరదలు, తర్వాత రెండేళ్ల కరోనాతో కార్తీక మాసంలో సందడి లేకుండా పోయింది. చివరి రెండేళ్ల అవకాశం చిక్కినా ఆ స్థాయిలో సందర్శకులు రాలేదు. ఒక్క కార్తీకమాసంలోనే ఏపీటీడీసీ అధికారులు భవానీ ద్వీపం ద్వారా రికార్డు స్థాయి ఆదాయాన్ని సాధించేవారు. సంస్థకు మంచి ఆదాయం తెచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని ద్వీపాన్ని సందర్శకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇటీవల కృష్ణాకు వచ్చిన మహోగ్ర వరద కారణంగా ఐల్యాండ్ తీవ్రంగా దెబ్బతినటంతో ఈ కార్తీక మాసానికి ఐల్యాండ్ సిద్ధం కాలేదేమో అనుకున్నా అధికారుల పట్టుదలతో మరికొద్ది రోజుల్లో సందర్శకులకు అందుబాటులోకి రానుంది. ఈ ద్వీపాన్ని పునరుద్ధరించటానికి లక్షలాది రూపాయలను ఖర్చు చేయాల్సి రావటంతో పాటు, కాలాతీతం అయ్యే అవకాశాలున్నాయి. అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కార్తీకానికి ఐల్యాండ్‌ను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో పనిచేయటంతో ఇప్పుడిప్పుడే కళ సంతరించుకుంటోంది. నవంబరు 1 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో అప్పటి కల్లా ద్వీపాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు పనులు కొనసాగిస్తున్నారు. వనసమారాధనకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకుని అందుకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతున్నారు. ఐల్యాండ్ పశ్చిమ భాగంలో పేరుకున్న ఇసుక తిన్నెలను ఇప్పటికిప్పుడు తొలగించి పునరుద్ధరించటం కష్టసాధ్యమైనా వీటితో సందర్శకులకు ఇబ్బంది ఉండదని భావించారు. పైగా ఇసుక తిన్నెలపై పిల్లలు ఆడుకుంటారు కాబట్టి వాటిని కదల్చకూడదని నిర్ణయించారు. ద్వీపం ముఖద్వారం నుంచి కాటేజీల వరకు లోపలున్న పాత్‌వేలు, లాన్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎక్కడికక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. ఉదయం నుంచి చీకటిపడే వరకు రోటోవీవర్లతో గడ్డిని కోయించి మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆట పరికరాలు, ఓపెన్ జిమ్, ఓపెన్ మ్యూజిక్ ఏరియాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలను చేస్తున్నారు. లాగే రెస్టారెంట్లను అందుబాటులోకి తెస్తున్నారు. ప్రస్తుతానికి సందర్శకులు ప్రవేశానికి వీలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ సందర్శకులు ఇష్టపడేది టవర్ లొకేషన్. ప్రతి ఒక్కరూ ఇక్కడికొచ్చి సెల్ఫీలు దిగుతుంటారు. వరద కారణంగా టవర్ ప్రాంతమంతా కోతకు గురైంది. చుట్టూ కొంతమేర నీరు వచ్చి చేరింది. సందర్శకులు ఇటు వచ్చినపుడు ప్రమాదం జరగకుండా ఇసుక బస్తాలను సిద్ధం చేస్తున్నారు. అసాధ్యమనుకున్న పనులను అధికారులు వేగంగానే చేయిస్తున్నారు. మరోవైపు భవానీ ఐల్యాండ్‌లో పార్టీలకు బుకింగ్‌లు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. సమయం గడుస్తున్న బుకింగ్ కోసం మరింత డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. మరోవైపు బోటింగ్ యూనిట్, హరిత బెర్మ్‌పార్క్‌ను ఇప్పటికే ముస్తాబు చేశారు. సందర్శకులు ముందుగా ఇక్కడికి వచ్చి తమ వాహనాలను పార్క్ చేసుకుని నేరుగా బోటింగ్ యూనిట్‌కు వెళ్లి టికెట్ తీసుకుని బోట్లపై ద్వీపానికి చేరుకుంటారు. ఎక్కడా సందర్శకులు ఇబ్బంది పడకుండా అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు.



జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న సిబ్బంది





ఇసుక మూటలను సిద్ధం చేస్తున్న కూలీలు



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న బ్యాంకు ఉన్నతాధికారులు

బ్యాంక్ ఆఫ్ బరోడా విరాళం రూ.కోటి

లబ్బీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం బ్యాంక్ ఆఫ్ బరోడా కోటి రూపాయలు విరాళాన్ని సీఎం చంద్రబాబుకు బ్యాంక్ ఉన్నతాధికారులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలతో ఎంతోమంది ప్రజలు ఇబ్బందులు పడ్డారని వారిని ప్రభుత్వం ఆదుకుంటోందని అందులో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా తన వంతు సాయంగా రూ.కోటి విరాళాన్ని సీఎం సహాయనిధికి అందజేసిందన్నారు. జోనల్ హెడ్ అండ్ జనరల్ మేనేజర్ హైదరాబాద్ జోన్ రితిష్ కుమార్, డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, డీజీఎం, రీజినల్ హెడ్ చందన్ సాహూ పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి శేఖర్

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనకదుర్గమ్మను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి టీసీడీ శేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అమ్మవారికి ఫ్యాన్సీ నెక్లెస్ కానుక



రాజమండ్రి పీఅండ్‌టీ కాలనీకి చెందిన కేశమ శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం 18 గ్రాముల బంగారు ఫాన్సీ నెక్లెస్‌ను కానుకగా అందజేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన కేశవ శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజును కలిసి దేవస్థానానికి 18 గ్రాముల బంగారు ఫ్యాన్సీ నెక్లెస్‌ను కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ఆశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



అక్కపాలెం రహదారిలో ఏర్పడిన గండి

రహదారికి మరమ్మతులెప్పుడు..!

- భారీ వాహనాల వల్ల రహదారిపై ఏర్పడ్డ గోతులు
- రైతులు, వాహనదారులకు తప్పని తిప్పలు

తిరువూరు నుంచి అక్కపాలేనికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తి గోతులమయంగా మారింది. అలాగే పడమటి వాగు బ్రిడ్జి సమీపంలో రోడుకు గండి పడటంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రైతులు, వాహనదారులు రాకపోకల సమ యాల్లో ఇబ్బందులు పడుతున్నారు.

ఆంధ్రజ్యోతి - తిరువూరు: పట్టణం నుంచి అక్కపాలేనికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తి గోతుల మయంగా మారింది. దీంతో పాటు పడమటి వాగు బ్రిడ్జి సమీపంలో రోడ్డుకు గండి పడటంతో రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. పట్టణంలోని రాజుపేట రెవెన్యూ పరిధిలోని రైతుల భూములు అక్కపాలెం పడమటి వాగు అవతల ఒడ్డున ఉండటంతో రైతులు నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. పంటభూముల్లోని అదనపు నీరు తిరిగి వాగులో కలిసేందుకు బ్రిడ్జి సమీపంలో ప్రదాన రహదారి కింద దీర్ఘకాలం క్రితం ఏర్పాటుచేసిన తూరలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇటీవల రోడ్డుకు రెండు చివరల తూరలు పగిలి గోడులు ఏర్పడ్డాయి. ఇటీవలి కాలంలో ఈ రోడ్డుపై వాగు నుంచి పెద్దసంఖ్యలో ట్రాక్టర్లు ఈ రోడ్డుమీదుగా ఇసుక తోలకాలు సాగిస్తుండటంతో రోడ్డు దిగువన వేసిన తూరలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో ప్రస్తుతం ఆ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. వాగు అవతల సాగుభూములు గల రైతులు, తమతమ భూములకు వెళ్లాలంటే పడరానిపాట్లు పడాల్సి వస్తోంది. పంటకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు పంటవద్దకు తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారి అభివృద్ధి చేయకపోతే దిగుమతి అయిన పంటను, ఇంటికి తీసుకువెళ్లే అవకాశం లేకుండా పోతుందనే భయం రైతుల్లో నెలకొంది. ఇప్పటికే తిరువూరు నుంచి అక్కపాలెం వెళ్లే ప్రదాన రహదారి పూర్తి గోతులమయంగా మారింది. దీంతో గ్రామస్థులు మునుకుళ్లమీదుగా చుట్టూ తిరిగి పట్టణానికి చెరుకుంటున్నారు. అత్యవసరమైన సమయాల్లోనూ చుట్టూ తిరిగి రావల్సిందే. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.



పడమటి వాగు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గోతులు

30న జగ్గయ్యపేటలో జాబ్‌మేళా

జగ్గయ్యపేట : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధికల్పనా శాఖ, డీఆర్‌డీఏ, సీడాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 30న జగ్గయ్యపేటలో జేఆర్‌సీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు తెలిపారు. జాబ్ మేళాకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సిస్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటారని, కంపెనీలో పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18- 45 సం.లలోపు వయస్సు కలవారు అర్హులన్నారు. ఉద్యోగాలు పొందిన వారికి రూ.10వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం, ఇతర సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యాభివృద్ధి సంస్థ వెబ్‌సైట్ లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9014943757 అనే నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా ఏవీ రావు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్వజనాసుపత్రి నూతన సూపరింటిండెంట్‌గా ఎ.వెంకటేశ్వరరావు (ఎ.వి రావు)ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏవీరావు ఇదే ఆసుపత్రిలో కొన్నేళ్లుగా మత్తు విభాగాధిపతిగా పని చేస్తున్నారు. మంచి ప్రవర్తన కలిగిన ఆయనకు పదోన్నతిపై సూపరింటిండెంట్‌ను చేశారు. ఇక్కడ సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్న డి.వెంకటేశ్వరరావును అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎమ్‌ఈ)గా పదోన్నతి కల్పించారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ఆటోనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆటోనగర్ డిపో మేనేజర్ కె.ప్రవీణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2, 3, 4, 9, 10, 11, 15, 16, 17, 18, 23, 24, 25 తేదీల్లో సూపర్ లగ్జరీ బస్సులను ఉదయం 3 గంటలకు ఆటోనగర్ నుంచి, పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి ఉదయం 4 గంటలకు బస్సులు ప్రారంభమవుతాయన్నారు. రిజర్వేషన్‌తో కలిపి చార్జీ రూ.1140 ఉంటుందన్నారు. వివరాలకు 7382899266, 8074298487లను సంప్రదించాలని కోరారు.

కెజ్రీవాల్‌పై దాడి సరికాదు

ధర్నాచౌక్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కెజ్రీవాల్‌పై ఎన్నికల ప్రచారంలో భాగంగా వికాస్‌పూరిలో ఈ నెల 25న దాడి చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే నారాయణ, మాజీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఎం నేత వైవీ రావు, ఆమ్‌ఆద్మీ పార్టీ జోన్ సికో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు ఖండించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ మాట్లాడుతూ వ్యవస్థలను వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వైవీ రావు మాట్లాడుతూ కెజ్రీవాల్‌ను కేసులతో ఇబ్బందులు పెడుతూ రాజకీయంగా అడ్డు తొలగించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కంభంపాటి కృష్ణ, ముస్లింలీగ్ నేత ఖాజావలి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30కి మంది జరిమానా

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందికి రైల్వే కోర్టు జరిమానా విధించింది. మూడో ట్రాఫిక్ స్టేషన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 30 మందిని కోర్టులో సోమవారం హాజరుపరిచారు. వారిలో ఒక్కొక్కరికి రూ.10వేల రిమానా విధించింది.

షర్మిల జోలికొస్తే సహించేది లేదు

- సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి

గవర్నర్‌పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే వైసీపీ నేతలు రాజశేఖరరెడ్డి బిడ్డ వైఎస్ షర్మిలారెడ్డిపై విషం చల్లుతున్నారని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. సోమవారం సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిపై వైసీపీ నేతలు గుడివాడ అమర్‌నాథ్, అంబటి రాంబాబు, పేర్ని నాని, భూమన కరుణాకరరెడ్డి, విజయసాయిరెడ్డి విషం చిమ్మడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కుటుంబ విషయంలో జగన్మోహనరెడ్డి, షర్మిల మాట్లాడుకోవడం గురించి వీరికెందుకు బాధ కలిగిందన్నారు. ఏపీ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం, ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ నజీర్, అమరావతి ప్రాంత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మినేని సురేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కాశీనాథ్



సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

చిట్టినగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కారంతోపాటు పార్కు, వాటర్, వెహికల్ డిపో మెకానిక్ సెక్షన్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డివిజన్‌ల జనాభా ప్రకారం కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. క్లాప్ ఆటో కార్మికులకు జీతాలు పెంచి ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులు 45 మందికి వరదల్లో ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారికి రావాల్సిన 12 రోజుల జీతం బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలో ఉన్న టెక్నికల్ ఇబ్బందులు సరిచేసి కార్మికులందరికీ వర్తింపజేయాలన్నారు. వెహికల్ డిపోలో 35 మంది క్లీనర్లను డ్రైవర్లుగా ప్రమోట్ చేయాలన్నారు. మెకానిక్ విభాగంలోనూ సీనియార్టీ ప్రకారం హెల్పర్లను మేస్త్రీగా ప్రమోట్ చేయాలన్నారు. ప్రతి కార్మికునికి ఇన్సూరెన్స్ రూ.25లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో వారి పిల్లలకు వెంటనే ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకివ్వాల్సిన సబ్బులు, నూనె ఇతరాత్ర సామగ్రి క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, యూనియన్ నగరాధ్యక్షుడు జ్యోతిబస్, నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ టీ ప్రవీణ్, నగర ఉపాధ్యక్షుడు ధనికొండ వెంకటేశ్వరరావు, నేతలు నాగరాజు, దుర్గాప్రసాద్, సుందరయ్య, తిరుపతమ్మ, జే.విజయలక్ష్మి పాల్గొన్నారు.



స్థూపం వద్ద విజయసూచిక చూపిస్తున్న సాగునీటి సంఘాల నేతలు

నీటి సంఘాల ఎన్నికల పట్ల ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాలో మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల్లోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉమ్మడి కృష్ణాజిల్లా రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యుడు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి హర్షం వ్యక్తం చేశారు. 2014-19లో సాగునీటి సంఘాలు విజయవంతమైన సందర్భంగా 2018లో ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణాతూర్పు డెల్టా ప్రధాన రెగ్యులేటర్ ప్రారంభం సందర్భంగా నాటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన స్థూపం వద్ద సోమవారం ఎ.గోపాలకృష్ణారావు, గుత్తా శివరామకృష్ణ, వై.పుల్లయ్యచౌదరి, ఎస్.దిలీప్ కుమార్, జి.శ్రీనివాసరావు, బొర్రా అశోక్ కుమార్ విజయసూచిక చూపిస్తూ హర్షం వ్యక్తం చేశారు. గోపాలకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల్లో 71 లక్షల ఆయుకట్టుకు 49 వేలు ప్రాదేశిక నియోజకవర్గాలకు, 6,149 సాగు నీటి సంఘాలకు, 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 53 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. కృష్ణాజిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్, ఉమ్మడి కృష్ణాజిల్లా నీటి సంఘాల ప్రతినిధులు వీరంకి వెంకటేశ్వరరావు, మంతెన రామాంజనేయులు, జాలిపర్తి ప్రసాద్, గుమ్మడి దేవేంద్ర రాజు, జంగా చెంచురెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌బీఐ-90 క్విజ్ పోటీలు విజయవంతం

- రాష్ట్రస్థాయి విజేతగా ఐఐపీఈ - విశాఖపట్నం బృందం


వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్థాపించి 90 ఏళ్లయిన సందర్భంగా నిర్వహించిన ఆర్‌బీఐ-90 జాతీయ క్విజ్ పోటీల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు విజయవంతంగా ముగిసినట్టు ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ తెలిపారు. సెప్టెంబరు 19 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో జరిగిన ప్రాథమిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల బృందాలకు సోమవారం విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. హోటల్ నోవాటెల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 53 బృందాలకు చెందిన 166 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, (ఐఐపీఈ-విశాఖపట్నం)కి చెందిన కృతజ్ఞ శర్మ, ఉజ్వల్ నారాయణ్ బృందం విజేతగా నిలిచిందని, అలాగే స్పెన్సర్స్ డిగ్రీ కళాశాల ద్వితీయ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (కర్నూల్) తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ప్రథమ విజేత బృందానికి రూ.2 లక్షలు, ద్వితీయ బృందానికి రూ.1.5 లక్షలు, తృతీయ బృందానికి రూ.1లక్ష చెక్కులు ఇచ్చినట్టు చెప్పారు. విజేతగా నిలిచిన బృందం జోనల్ రౌండ్‌లో పోటీ పడుతుందని, ఈ పోటీలు ఈ ఏడాది నవంబర్ 21, డిసెంబరు 4 మధ్య జరుగుతాయన్నారు. జాతీయస్థాయి ఫైనల్ పోటీలు డిసెంబరులో ముంబయిలో జరగనున్నట్లు వివరించారు. ఆర్‌బీఐ ఎఫ్ఐడీడీ జీఎం మహేన్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అన్ని జిల్లాల ఎల్‌డీఎంలు పాల్గొన్నారు.



విజేతలకు చెక్కు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్

నైపుణ్య గణనకు సిద్ధమవ్వండి


- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో జిల్లాలో నైపుణ్యగణన (స్కిల్ సెన్సస్) ప్రక్రియ సజావుగా జరిగేందుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి ఆమె ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవంబరు 3 నుంచి ప్రారంభం కానున్న సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని, సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. మంగళవారం ఒక్కో మండలం నుంచి ఇద్దరు చొప్పున సచివాలయం సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుత ఉపాధి వివరాలు, నైపుణ్యాలు, ఆకాంక్షలు, తదితర 25 రకాల ప్రశ్నల ద్వారా సమాచారం సేకరించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు సంబంధించి అక్టోబరు 31న సెలవుదినం కావటంతో 30నే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి నవంబర్ 1, 2న పెన్షన్ పంపిణీ పూర్తి చేయాలన్నారు. 2,33,248 మంది పెన్షన్‌దారులకు రూ.99.45 కోట్ల మేర పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఉదయం 6 గంటలకే పంపిణీ ప్రారంభించాలన్నారు. నీటి వినియోగదారు సంఘాల ఎన్నికలపైన ఆమె పలు సూచనలు చేశారు. డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో లావణ్య, ఎస్.ఎస్.పి. ఇరిగేషన్ ఎస్ఈ శివరామకృష్ణ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి పాల్గొన్నారు.

నందిగామ కోర్టు జూనియర్ అసిస్టెంట్

అనుమానాస్పద మృతి



పద్మావతి భౌతికకాయం

జగ్గయ్యపేట, అక్టోబరు 28: నందిగామ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న స్థానిక ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న మహిళ మృతి చెందిన ఘటనపై జగ్గయ్యపేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కాలనీలో రామావతుల పద్మావతి (32) గతంలో జగ్గయ్యపేట కోర్టులో పనిచేసి ప్రస్తుతం నందిగామ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. భర్త వాసు జగ్గయ్యపేట సమీపంలో ఒక కర్మాగారంలో పనిచేస్తుండటంతో ఇక్కడ నుంచి ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమ యంలో ఆమె బాత్‌రూమ్‌లో ఉరేసుకున్నట్టు భర్త చెబుతున్నారు. వారికి చైతన్య సాయి నాయక్ (14) అనే కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య విభేదాలున్నాయని, భర్త ప్రవర్తనపై పద్మావతి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగ్గయ్యపేట సీఐ పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్సై వెంకటేశ్వరరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయిన్లలో పూడిక తీయించాలి

కూచిపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లు, పంట కాలువల పూడికతీత పనులు చేపట్టి పంటలు రక్షించాలంటూ చినముత్తేవికి చెందిన పూనుకొల్లు రామ్మోహనరావుతోపాటు పలువురు రైతులు తాడేపల్లి ప్రజావేదికలోనూ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఉండ్రపూడి, నిభానుపూడి, నిమ్మకూరు గ్రామాల నుంచి వచ్చే మురుగు వల్ల తమ పొలాలు ముంపు బారిన పడుతున్నాయని, కాలువలు వెడల్పు చేసి డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టాలని వారు పేర్కొన్నారు. చినముత్తేవి నుంచి ఉండ్రపూడికి రహదారి నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన ఐనంపూడి, గేదెలకోడు డ్రెయిన్లపై శాశ్వత వంతెనలు నిర్మించాలని, కల్వర్టులు నిర్మించి తూములు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● తోట్లవల్లూరు ప్రజా వేదికలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. తోట్లవల్లూరు దళితవాడలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, స్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, గరికపర్రులో పీఏసీఎస్ వరకు రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని వినతులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని కుమార్ రాజా హామీ ఇచ్చారు. ఎంపీడీవో రవికాంత్, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి పాల్గొన్నారు. తోట్లవల్లూరులో అనారోగ్యంతో బాధపడుతున్న ఉయ్యూరు పండుకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చేతుల మీదుగా టీడీపీ నాయకుడు ఉప్పులూరి గోపాల కృష్ణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.


తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదికలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా


సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తున్న రావి వెంకటేశ్వరరావు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు: రావి

నందివాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం అరిపిరాల, రామాపురం, వెంకట రామాపురం, వెన్ననపూడి గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో రూ.38 లక్షల నిధులతో సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. దానేటి సన్యాసిరావు, రాధాకృష్ణ, కాకరాల సురేష్, యార్లగడ్డ రవి, మద్దాల ఇస్సాకు, సాల్మన్ రాజు, ముళ్లపూడి రమేష్, అందుగుల ఏసుపాదం, మేడేపల్లి ప్రసాద్, గాబ్రేలు, విశ్వేశ్వర రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

కాపు నాయకుడు గోవాడ చంటి కన్నుమూత

గుడివాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందతిన కాపు నాయకుడు గోవాడ చంటి అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌లు చంటి భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. జనసేన, టీడీపీ నాయకులు పలువురు నివాళులర్పించారు.


జీవీ మాల్ పైభాగం నుంచి మంటలు అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తప్పిన పెనుప్రమాదం

గుడివాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీవీ మాల్‌లో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం మాల్‌లోని ఐదో అంతస్థులో ఏసీల కంప్రెషర్ నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారమందించారు. అగ్నిమాపక సిబ్బంది మాల్ వద్దకు చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో ఎటువంటి నష్టం జరగకపోవడంతో సిబ్బంది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకుంటున్న శాయన పుష్పావతి దంపతులు

టీడీపీ సభ్యత్వ నమోదు

గుడ్లవల్లేరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి, జిల్లాపరిషత్ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ శాయన పుష్పావతి, ఎస్వీఎస్ ప్రసాద్ దంపతులు సోమవారం చినగొన్నూరులో తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయించుకున్నారు. మండలంలో ప్రత్యేక బృందాలు పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్నాయి. సోమవారం తొలిగా పుష్పావతి, ప్రసాద్ దంపతుల సభ్యత్వాన్ని రెన్యువల్ చేశారు.

బాస్కెట్‌బాల్ దక్షిణ భారత పోటీలకు ఏఎన్ఆర్ విద్యార్థులు

గుడివాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నూజివీడు ధర్మఅప్పారావు కళాశాలలో నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచిన ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థులు బి.దేవదానం, ఎస్.వర్ధన్‌లు దక్షిణ భారత అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కృష్ణా విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కే ప్రసాద్, కేఎస్ అప్పారావు పేర్కొన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల విద్యాకుటుంబం

రన్నింగ్ రాష్ట్ర పోటీలకు మొవ్వ హైస్కూల్ విద్యార్థినులు

కూచిపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పరుగు పందెం రాష్ట్రస్థాయి పోటీలకు మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని పీడీ ఎ.రామారావు తెలిపారు. అండర్-17 విభాగంలో చైతన్య లక్ష్మి, అన్నవరపు హాసిని ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. నవంబరులో శ్రీకుళం జిల్లాలో నిర్వహించే పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్ఎం పి.శివకోటేశ్వరరావు, ఉపాధ్యాయ కార్యదర్శి జాకీఅహ్మద్, ఎస్ఎంసీ ఛైర్మన్ గురువిందపల్లి బాబూరావు అభినందించారు.

గుడివాడ-విజయవాడ రహదారి అభివృద్ధి చేయాలి

గుడివాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుడివాడ-విజయవాడ రహదారిని త్వరితగతిన అభివృద్ధి చేయాలని, నాలుగు నియోజకవర్గాల గుండా ఈ రహదారి వెళుతుందని వాటి పరిధిలోని ఎమ్మెల్యేలు నిధుల కోసం కృషి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గుడివాడ-కంకిపాడు రహదారికి వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కంకిపాడు నుంచి గుడివాడ వరకు నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థల సభ్యులు పాదయాత్రకు మద్దతు తెలిపారు. సంఘీభావంగా యాత్రలో పాల్గొన్నారు.



కంకిపాడు నుంచి గుడివాడకు పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

● మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరిక

గుడివాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బంది తమ పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. వార్డుల్లో గ్యాంగ్ వర్క్‌ను సందర్శించారు. డ్రెయిన్ల క్లీనింగ్, పిచ్చిమొక్కలు, కాలువల్లో పోగులను సిబ్బంది తొలగించారు. బంటుమిల్లి రోడ్డులో బాణాసంచా దుకాణాలను పరిశీలించి వారికి సూచనలు చేశారు. హిందూ, ముస్లిం స్మశానవాటిక ప్రాంతాలను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది పలు సూచనలు చేశారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, శానిటరీ సిబ్బంది ఉన్నారు.


డ్రెయిన్ల పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు

టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

పామర్రు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయాలకు అనుమతి పొందిన దుకాణదారులు నిర్దేశిత ప్రాంతంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు పాటిస్తూ విక్రయాలు జరుపుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో షారోన్ ఆదేశించారు. చల్లపల్లి రోడ్డులోని జగపతినగర్‌లో దుకాణదారులకు కేటాయించిన స్థలాన్ని, కొత్త పెదమద్దాలి వద్ద ఏర్పాటుచేస్తున్న దుకాణాల సముదాయాలను అగ్నిమాపక, పోలీసు అధికారులతో కలిసి ఆమె సోమవారం పరిశీలించారు. 9 దుకాణాలకు అనుమతి మంజూరు చేశామని తెలిపారు. అగ్నిమాపకశాఖ అధికారి ఎన్.రాంబాబు, తహసీల్దార్ జి.రవికాంత్, ఆర్ఐ ఎ.రాము పాల్గొన్నారు.


పామర్రులో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో షారోన్

11 బాణాసంచా దుకాణాలకు అనుమతి

కూచిపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలో 11 బాణాసంచా విక్రయ దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్టు తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. పెదపారుపూడి వర్తక సంఘ కల్యాణ మండపంలో నాలుగు, నిడుమోలు జడ్పీ హైస్కూల్ ఆవరణలో నాలుగు, మొవ్వ, కాజ శివాలయాల వద్ద, కోసూరు పీఏసీఈఎస్ ఆవరణలో ఒక్కొక్క దుకాణానికి అనుమతి ఇచ్చారు. అధికారుల బృందం దుకాణాలు ఏర్పాటు చేసుకునే స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ మస్తాన్, ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం, అగ్నిమాపక శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, ఎం.రాంబాబు, సర్వేయర్ ఎ.కిషోర్, ఆర్ఐ విజయదుర్గ స్థలాన్ని పరిశీలించారు.

కూచిపూడిలో గ్రామస్థుల అభ్యంతరం

కూచిపూడిలో నివాస గృహాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయటంపై కూచిపూడి, పెదపూడి గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దుకాణాలను వేరే ప్రాంతాలకు మార్చాలని కోరుతున్నారు.

అయ్యంకి-మొవ్వ రోడ్డుకు మరమ్మతులు

● బస్సుల రిపేర్లు చేయించలేక సొంత నిధులు వెచ్చించిన ఆర్టీసీ అద్దె బస్సు యజమానులు

కూచిపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి- చల్లపల్లి ప్రధాన రహదారిలో అయ్యంకి నుంచి మొవ్వ కోర్టు వరకు ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. దెబ్బతిన్న రహదారి కారణంగా విజయవాడ నుంచి అవనిగడ్డ వైపు నడిచే బస్సులకు తరచూ మరమ్మతులు చేయించాల్సి వస్తోంది. దీంతో రోడ్డు మరమ్మతులకు ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు నడుం బిగించారు. డీజిల్ వాడకం పెరగటంతో నష్టాల పాలవుతున్నామని, గత ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించకపోవటం వల్ల ఈ దుస్థితి తమకు దాపురించిందని బస్సు యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె బస్సు యజమాని నూతక్కి జనార్దనరావుతోపాటు పలువురు ప్రైవేట్ ఆపరేటర్లు అయ్యంకి నుంచి మొవ్వ కోర్టు వరకు సొంత నిధులు వెచ్చించి నాలుగు జేసీబీలతో మరమ్మతులు చేపట్టారు. శాశ్వత రహదారి నిర్మించి ఆదుకోవాలని వారు కోరారు.







బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.550

బాణాసంచా దుకాణాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలి

అవనిగడ్డ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాణా సంచా దుకాణాల వద్ద ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు ప్రదేశాన్ని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఫైర్ అధికారి ప్రసాద్ పరిశీలించి దుకాణదారులతో సమీక్ష నిర్వహించారు. అవనిగడ్డలో మొత్తం 15 దుకాణాలకుఅనుమతులు ఇచ్చామని, దుకాణాల వద్ద భద్రతా వైఫల్యాలు ఉన్నా అమ్మకాలు నిలిపివేస్తామని హెచ్చరించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఘంటశాల మహిళలు

ఇళ్ల మధ్య వైన్‌షాపు ఏర్పాటు చేయొద్దు

● కలెక్టరేట్ వద్ద ఘంటసాల మహిళల ధర్నా

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల మధ్య వైన్‌షాపు ఏర్పాటు చేయొద్దంటూ ఘంటసాల గ్రామ మహిళలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సమస్యపై ఘంటశాల మండల స్థాయి అధికారులతో మాట్లాడామన్నారు. అయినా వైన్‌షాపు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇళ్లు, చర్చిలు, దేవాలయాలు, పాఠశాలల మధ్య వైన్‌షాపులు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ఘంటసాల మహిళలు లోకేశ్వరి, నందం రోజా, చందన నాగలక్ష్మి డిమాండ్ చేశారు.



లక్ష్మణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండలి, అక్కినేని

లక్ష్మణరావు సేవలు చిరస్మరణీయం

అవనిగడ్డ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా డెల్టా పరిరక్షణకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అంబటి లక్ష్మణరావు అందించిన సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, సాగునీటి సంఘ ప్రముఖులు అక్కినేని భవాని ప్రసాద్ అన్నారు. అవనిగడ్డ గాంధీక్షేత్రంలో అంబటి లక్ష్మణరావు సంతాప సభ బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. లక్ష్మణరావు చిత్రపటానికి వారు నివాళులర్పించారు. జనసేన నేత మత్తి వెంకటేశ్వరరావు, గాంధీక్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, మండలి వెంకట్రామ్, టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, బచ్చు రఘునాథ్, జనసేన నేత రాజనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాలతో రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

మోపిదేవి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన సిమెంట్ రోడ్లు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా పంచాయతీ రాజ్ డీఈఈ బి.సురేష్ తెలిపారు. కోసూరు వారిపాలెంలో రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, కూటమి నేతలు కోసూరు అనూహ్య, నాగమల్లేశ్వరరావు, భోగిరెడ్డి సాంబశివరావు, సనకా ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల బెడద

● మూలనపడ్డ ఆపరేషన్ థియేటర్ ● పెరిగిపోతున్న కుక్కకాటు బాధితులు

● కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పునరుద్ధరించాలని ప్రజల వేడుకోలు



మచిలీపట్నంలోని కుక్కల కుటుంబ నియంత్రణ శాల, విశ్రాంతి గదులు

ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం టౌన్ : జిల్లా కేంద్రం మచిలీపట్నంతో పాటు గ్రామాల్లోనూ వీధి కుక్కల బెడద పెరిగిపోయింది. వృద్ధులు, పిల్లలు కుక్కకాటుకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. కొల్లు రవీంద్ర మంత్రిగా ఉన్న సమయంలో 2017 సెప్టెంబర్ 2న రూ. 17 లక్షలతో వీధి కుక్కల సంతతిని నియంత్రించేందుకు కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి, వారం రోజుల పాట విశ్రాంతి గదుల్లో ఉంచి ఆ తర్వాత అడవుల్లో వదిలేవారు. ఈ థియేటర్ రెండేళ్లపాటు బాగానే కొనసాగింది. కుక్కల సంఖ్య తగ్గుముఖం పట్టింది. కాగా, గత ఐదేళ్లుగా కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్ మూలన పడింది. దాంతో కుక్కల సంతతి విపరీతంగా పెరిగి వాటి బెడద ఎక్కువైంది. ఏ వీధిలో, ఏ గ్రామంలో చూసినా కుక్క కాటుకు గురైన వారి సంఖ్య పెరిగిపోతోంది. కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్ ప్రారంభించాలని కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము తదితరులు మునిసిపల్ కౌన్సిల్ సమేవేశంలో కోరారు.

నిధులు విడుదల చేస్తే ఆపరేషన్ చేస్తాం



కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్ పునరుద్ధరించేందుకు నిధులు అవసరం. కుక్కలను పట్టి ఆపరేషన్ థియేటర్‌తీసుకుని వచ్చే ఏజెన్సీని మళ్లీ ఏర్పాటు చేయాలి. ఆపరేషన్ థియేటర్‌కు మరమ్మతులు చేయించాలి. ఆపరేషన్ చేసేందుకు వైద్య పరికరాలు, మందులు కొనుగోలు చేయాలి. వీటిని అందిస్తే ఆపరేషన్ చేయగలుగుతాం.

- డాక్టర్ రమణయ్య, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

కుక్కల బెడద నివారించాలి



ఎంపీడీవోకు కుక్కల సమస్యను వివరిస్తున్న సర్పంచ్ తిమోతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కుక్కలను పట్టించి అడవుల్లో వదిలే కార్యక్రమం చేపట్టాలని పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతి తదితరులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో రోడ్లతో పాటు డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో రోడ్లు నిర్మాణాలు చేపట్టడంతో ప్రజల్లో ఆనందం కలుగుతోందన్నారు. ఎంపీడీవోను కలిసిన వారిలో నెలకుర్రు తదితర గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న కాగిత

దాళ్వాకు నీరిచ్చేందుకు కృషి

● ఎమ్మెల్యే కాగిత

కృత్తివెన్ను, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెండో పంటకు నీరిచ్చి ఆదుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు రైతులు సంగమూడిలో వినతి పత్రం అందజేశారు. త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి దాళ్వాకు నీరిచ్చేందుకు కృషి చేస్తానని కాగిత హామీ ఇచ్చారు. సంగమూడి కొత్త కాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లకు, చెరుకుమిల్లిలో రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఒడుగు తులసీరావు, పిన్నెంటి రత్తయ్య, పాశం నాగమల్లేశ్వరరావు, దాసరి శ్రీను, సర్పంచ్ కూనసాని సునీత, కూనసాని శ్రీనివాసరావు, కూనసాని చిన్న, యాదంరెడ్డి కొండ, అధికారి అప్పి, దాసరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగించాలని కోరుతూ డీటీ కనకదుర్గకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఆక్రమణలను తొలగించాలి

ఘంటసాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాపవినాశనం గ్రామపంచాయతీ గొల్లపాలెం సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఆక్రమణలను తొలగించాలంటూ గ్రామస్థులు సోమవారం డీటీ కనకదుర్గ, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావులకు వినతిపత్రాలు అందజేశారు. జడ్పీ ప్రధాన రహదారి, కాల్వ గట్టు ప్రాంతం ఆక్రమణలకు గురైందన్నారు. ఆక్రమణల వల్ల కాలువ దిగువ ప్రాంతానికి పూర్తిస్థాయిలో నీరు పారటం లేదన్నారు. గ్రామస్థులు డొక్కు సాంబశివరావు, గొరిపర్తి వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, డొక్కు వసంతరావు, డి.శివరామకృష్ణ, గొరిపర్తి రామదాసు, డొక్కు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కొనకళ్ల నారాయణరావు

అవనిగడ్డలో స్థలాలు కేటాయించాలి

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వరదలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్న పాత ఎడ్లంక వాసులకు అవనిగడ్డలో స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ గ్రామస్థులు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో 375 కుటుంబాలు వరదల వల్ల ప్రాణభయంతో గ్రామం విడిచి వెళ్లటానికి సైతం నిర్ణయించుకున్నారన్నారు. సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం సంతకం చేయగా, మునిపల్లి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్‌రావు, నరసింహారావు, మునిపల్లి వాసు, ఎస్.వీరాంజనేయులు తదితరులు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

పద్మావతి కళాశాలలో క్యాంటీన్ ప్రారంభం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : దూర ప్రాంతం నుంచి చదువుకునేందుకు వచ్చిన విద్యార్థినులకు క్యాంటీన్ వల్ల ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. పద్మావతి డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సోమవారం కొనకళ్ళ నారాయణరావు ప్రారంభించారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు రుచిగా , ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంచాలన్నారు. హిందూ కళాశాల అనుబంధ సంస్థల కార్యదర్శి డి గోపాలకృష్ణ శాస్త్రి, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిశీలన

కోడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన మేరకు ఇరిగేషన్ శాఖ సెంట్రల్ డిజైన్ అధికారులు సోమవారం మండలంలో పర్యటించారు. దివి ఎడమ వరద కరకట్ట పరిధిలో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిస్‌లను పరిశీలించారు. విశ్వనాథపల్లి, పిట్టల్లంక, లింగన్నకోడు, కోడూరు డ్రైనేజీలపై అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ప్రస్తుత పనితీరు, సామర్థ్యం కట్టడాల పటిష్టత, షట్టర్ల పనితీరు పరిశీలించారు. అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల పునర్నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఇరిగేషన్ శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఈఈ ఎం.ఎన్.వి.వేణుగోపాలరావు, డీఈఈ ఎం.నాగలక్ష్మి, ఏఈ కె.నిహారిక, ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈ విజయ్ కుమార్ పాల్గొన్నారు. **మోపిదేవి** : పెదకళ్లేపల్లి పరిధిలో ఉత్తర చిరువోలులంక -1, 2, అయోధ్య, మంగళవానిశింకు అవుట్ ఫాల్ స్లూయిస్‌లను ఇరిగేషన్ శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు.

నాగాయలంక విద్యార్థుల ప్రతిభ



నాగాయలంక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కొక్కిలిగడ్డ విన్ని, నాగిడి అశ్విని 50, 100, 200 మీటర్ల ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్ విభాగాలలో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.వి. ప్రసాద్ తెలిపారు. విద్యార్థులను పీఎంసీ చైర్మన్ వక్కపట్ల మారుతి, ఫిజికల్ డైరెక్టర్లు గాజుల లక్ష్మీ ప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు అభినందించారు.



టీడీపీ సభ్యత్వ నమోదులో సాయిరామ్‌గౌడ్

టీడీపీ సభ్యత్వంతో గౌరవ మర్యాదలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో గౌరవ మర్యాదలు పెరుగుతాయని మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు లుక్కా సాయిరాం గౌడ్ అన్నారు. మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదును లుక్కా సాయిరాం గౌడ్ పరిశీలించారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీం బేగ్, నాయకులు సాతులూరి నాంచారయ్య, చిల్లిముంత ప్రవీణ్, వాడపల్లి రమేష్, మహమ్మద్ సిరాజుద్దీన్, అమీన్, ప్రకాష్, అనిత, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

జనసేన నాయకులకు పరామర్శ

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో పితృవియోగానికి గురైన జనసేన పార్టీ నాయకులు మండలి సుధీర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పరామర్శించారు. గ్రామీణ యువజన వికాససమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ (రాజా), మత్తి శ్రీనివాసరావు, మండలి శేషు, మండలి రామ్మోహనరావు, మండలి శివప్రసాద్, నాగిడి రాంబాబు, యలవర్తి ఆది, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. బాబాయిని కోల్పోయిన జనసేన పార్టీ నాయకులు వినయ్‌ను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలి

అవనిగడ్డ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ జూనియర్ కళాశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకారం అందించాలని ప్రిన్సిపాల్ రేఖారాణి కోరారు. జూనియర్ కళాశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఐదేళ్లుగా కళాశాల జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తోందని, దీని కొనసాగించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అధ్యాపకులు నరసింహారావు, శ్రీనివాసరావు, గిరి, కృష్ణారావు, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.



ఎడ్ల బండ్లపై రాత్రిళ్లు అక్రమంగా ఇసుక రవాణా

యథేచ్ఛగా ఇసుక రవాణా

కోడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న కోడూరు మండలంలో రాత్రిళ్లు టైరు బండ్లపై యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. విశ్వనాథపల్లి గ్రామ సమీపంలోని కృష్ణానదిలో ఉన్న ఇసుకను నాటుపడవలతో ఒడ్డుకు తరలించిన ఎడ్ల బండ్లపై తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. పిట్టల్లంక, విశ్వనాథపల్లి, కుమ్మరిపాలెం సమీపంలోని కృష్ణానదిలో ఇసుక తీయటానికి అనుమతులు లేవని, ఇసుక రవాణా విషయం తమ దృష్టికి రాలేదని తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. తవ్వకాలు నిర్వహించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పెడన కౌన్సిల్ సమావేశం రేపు

పెడన, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో అజెండాలోని 17 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వలందపాలెంలో వివాహిత అనుమానాస్పద మృతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వలందపాలెం పెయింటర్స్ కాలనీకి చెందిన శిరీష (34) ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కొంత కాలంగా శిరీష తన భర్త మల్లేశ్వరరావుతో గొడవపడుతోంది. ఈ నేపథ్యంలో శిరీష ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అత్తింటి వారే చంపేశారని ఆమె సోదరి వనిత ఆరోపించింది. తన సోదరి శిరీష ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. భర్త మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శిరీష మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



చిత్రలేఖనం విజేతలకు బహుమతులు

నాగాయలంక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా నాగాయలంక యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం రేమాల వారిపాలెం యూపీ పాఠశాలలోని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు 20 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు మేనేజర్ ఎస్.ఈశ్వరరావు అందజేశారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేనేజర్ సౌరవ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



మోపిదేవి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు మోపిదేవి గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.వీరరవి తెలిపారు. అత్యంత ప్రతిభ కనబర్చిన కె.ప్రదీప్, అక్షయ్ కుమార్, ఏడుకొండలు స్వామి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

గీతా మందిరం సభ్యుడు రాము మృతి



భోగాది రాము (ఫైల్)

అవనిగడ్డ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గీతా మందిరం అభివృద్ధి కమిటీ సభ్యుడు భోగాది రాము (49) సోమవారం గుంటూరు జిల్లా కాటూరు వైద్యశాలలో మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గీతా మందిరం విమాన నిర్మాణం, ధ్వజస్తంభం ఏర్పాటు చేసి భక్తుల ప్రశంసలు పొందారు. ఆయన మృతికి మందిరం కమిటీ సభ్యులతోపాటు వురు అభిమానులు సంతా పం ప్రకటించారు. మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి

అవనిగడ్డ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం తన కార్యాలయంలో డ్రైనేజీ అధికారులతో సమావేశం నిర్వహించారు. చల్లపల్లి సబ్ డివిజన్ డ్రైనేజీ శాఖ డీఈఈ బి.కిరణ్‌బాబు, కోడూరు ఏఈ అబ్దుల్ కరీం, చల్లపల్లి ఏఈలు చిరంజీవి, భగవతి పాల్గొన్నారు.